సాక్షి

అనకాపల్లి

శుక్రవారం, 19, ఏప్రిల్, 2024



సుభోజనానికి శ్రీకారం

విశాఖ: కేజీహెచ్‌లో సుభోజనం కౌంటర్ పునరుద్ధరణకు గురువారం శంకుస్థాపన చేశారు.



అమ్మకు పంచామృతాభిషేకం

విశాఖ: కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు.

గరిష్టం/కనిష్టం
38.8/27.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. అధిక ఉష్ణోగ్రతలతో వడగాలులు వీచే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

ఇక సిసలైన ఎన్నికల వేడి!

- విడుదలైన ఎలక్షన్ నోటిఫికేషన్
- నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రారంభం
- తొలిరోజు పార్లమెంట్‌కు ఒకటి, అసెంబ్లీకి ఏడు నామినేషన్ల దాఖలు
- హోరెత్తనున్న అభ్యర్థుల ప్రచారం
- ఊరూవాడా సందడే సందడి



అనకాపల్లి పార్లమెంటు అభ్యర్థుల నామినేషన్లు స్వీకరించే కలెక్టర్ కార్యాలయం

సాక్షి, అనకాపల్లి: ఎండల వేడికి ఎన్నికల వేడి తోడైంది. నెల రోజుల క్రితం సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు విడుదలైంది. ఆ తర్వాత రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటిస్తూ వచ్చారు. టిక్కెట్లు ఖరారైన వారు ఇప్పటివరకు సాదాసీదాగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. సీట్లపై ఊగిసలాటలో ఉన్న వారు నామమాత్రపు ప్రచారానికే పరిమితమయ్యారు. గురువారం నాటికి ప్రధాన పార్టీలన్నీ తమ అభ్యర్థుల ప్రకటనను పూర్తి చేశాయి. గురువారం శాసనసభ, లోక్‌సభ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ లాంఛనంగా జారీ అయింది. దాంతో పాటే అభ్యర్థుల నామినేషన్ల దాఖలు ప్రక్రియ కూడా ఆరంభమైంది. ఇప్పటికే బరిలో నిలిచిన అభ్యర్థులు తమ నామినేషన్ల దాఖలుకు పండితులతో మంచి ముహూర్తాలను నిర్ణయించుకున్నారు. తొలిరోజు గురువారం అనకాపల్లి పార్లమెంట్ స్థానానికి ఒకటి, అసెంబ్లీ స్థానాలకు ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. అభ్యర్థులు తమ బలాన్ని ప్రదర్శించుకుంటూ, నినాదాలు చేసుకుంటూ అట్టహాసంగా వెళ్లారు. ఎవరి స్థాయిలో వారు జనంతో ఊరేగింపుగా వెళ్లి సంబంధిత రిటర్నింగ్ అధికారులకు తమ నామినేషన్లను సమర్పించారు. నామినేషన్ల దాఖలుకు ఈనెల 25 వరకు గడువు ఉండడంతో మిగిలిన వారు కూడా ఆలోగా వేయనున్నారు. ఇక ఊరూవాడా ప్రచారంతో హోరెత్తనుంది. అనకాపల్లి పార్లమెంట్ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పెందుర్తి నియోజకవర్గానికి చెందిన షేక్ సఫీ ఉల్లా నామినేషన్ దాఖలు చేశారు. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తరఫున నామినేషన్ వేసినట్టు ఆయన చెప్పినప్పటికీ బి–ఫారం లేనందున ఆయనను స్వతంత్ర అభ్యర్థిగా పరిగణించారు.

అసెంబ్లీ స్థానాలకు ఏడు నామినేషన్లు..

అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో అసెంబ్లీ నియోజకవర్గాలకు ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. అనకాపల్లి అసెంబ్లీ స్థానానికి పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున పాలమరశెట్టి అంబికాదేవి, బీఎస్పీ తరఫున సూదికొండ మాణిక్యాలరావు, యలమంచిలి అసెంబ్లీ స్థానానికి జనసేన పార్టీ నుంచి సుందరపు విజయకుమార్ (రెండు సెట్ల నామినేషన్లు), రిఫార్మ్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున బోను నాగేశ్వరరావు, నర్సీపట్నం అసెంబ్లీ స్థానానికి బీఎస్పీ నుంచి బొట్టా నాగరాజు, స్వతంత్ర అభ్యర్థిగా రాయపురెడ్డి భద్రాచలం నామినేషన్ వేశారు.

నేడు పలువురి నామినేషన్లు..

జిల్లాలో శుక్రవారం పలువురు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. యలమంచిలి అసెంబ్లీ స్థానానికి వైఎస్సార్‌సీపీ తరఫున ఉప్పలపాటి వెంకట రమణమూర్తి రాజు, అనకాపల్లి అసెంబ్లీకి జనసేన నుంచి కొణతాల రామకృష్ణ, నర్సీపట్నం అసెంబ్లీ స్థానానికి టీడీపీ నుంచి మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు నామినేషన్ దాఖలు చేయనున్నారు.

సుందరపు విజయ్‌కుమార్‌పై 9 క్రిమినల్ కేసులు -8లో

జగనన్నా.. మేమంతా సిద్ధం

- నేడు జిల్లాలో ప్రవేశించనున్న సీఎం వైఎస్ జగన్ బస్సుయాత్ర
- కాకినాడ జిల్లా పర్యటన ముగించుకొని రాత్రికి గొడిచర్లలో బస చేయనున్న ముఖ్యమంత్రి
- ఘన స్వాగతం పలికేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణుల భారీ ఏర్పాట్లు
- రేపు ఉదయం 9 గంటలకు జిల్లాలో సాగనున్న బస్సు యాత్ర
- గొబ్బూరు వద్ద సాయంత్రం 4.30 గంటలకు బహిరంగ సభ



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొడిచెర్లలో బస చేయనున్నారు.

సాక్షి, అనకాపల్లి: జిల్లా ప్రజలు **ఎప్పుడెప్పుడా అని** ఎదురుచూస్తున్న 'మేమంతా సిద్ధం' **బస్సు యాత్ర** శుక్రవారం రాత్రి జిల్లాలో ప్రవేశి**చనుంది. ఎన్నికల** ప్రచారంలో భాగంగా బస్సు యాత్ర చేపట్టిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కాకినాడ జిల్లా పర్యటన ముగించుకొని రాత్రి 8.30 గంటల ప్రాంతంలో అనకాపల్లి జిల్లాలో అడుగుపెడతారు. పాయకరావుపేట నియోజకవర్గంలో నర్సీపట్నం రోడ్డు జంక్షన్ వద్ద ప్రవేశించి, పాయకరావుపేట వై జంక్షన్, నామవరం మీదుగా గొడిచర్ల చేరుకుంటారు. సీఎం రాత్రికి అక్కడే బస చేయనున్నారు. మరుసటి రోజు శనివారం ఉదయం 9 గంటలకు బస్సుయాత్ర ప్రారంభమై పాయకరావుపేట, యలమంచిలి నియోజకవర్గాల మీదుగా అనకాపల్లి నియోజకవర్గం తాళ్లపాలెం సమీపంలోని గొబ్బూరు వద్దకు చేరుకుంటుంది. అక్కడ సాయంత్రం 4.30 గంటలకు జరగనున్న బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. అనంతరం కశింకోట, బయ్యవరం, అనకాపల్లి మీదుగా సాగే బస్సుయాత్ర విశాఖ జిల్లాలోకి ప్రవేశించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నేతలు తెలిపారు.

ఘన స్వాగతానికి ఏర్పాట్లు

ఈనెల 19వ తేదీ శుక్రవారం రాత్రి కాకినాడ జిల్లా నుంచి అనకాపల్లి జిల్లాలో ప్రవేశించనున్న 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రకు ఘన స్వాగతం పలికేందుకు జిల్లాలోని పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు సిద్ధమవుతున్నారు. పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు స్వాగతం పలకనున్నారు.

సభ ఏర్పాట్ల పరిశీలన

వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనకాపల్లి జిల్లాలో నిర్వహించనున్న 'మేమంతా సిద్ధం' బహిరంగ సభకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. తొలుత చోడవరం నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలనుకున్న బహిరంగ సభను కశింకోట మండలం తాళ్లపాలెం వద్ద గొబ్బూరుకు మార్పు చేశారు. సభా ఏర్పాట్లను ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌తో పాటు వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ తదితరులు గురువారం పరిశీలించారు.

గొడిచర్ల వద్ద నైట్ హాల్ట్

నక్కపల్లి: 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా శుక్రవారం రాత్రి జిల్లాలో ప్రవేశించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొడిచెర్లలో బస చేయనున్నారు.

కాకినాడ జిల్లా పర్యటన పూర్తి చేసుకొని పాయకరావుపేట జాతీయ రహదారి మీదుగా నక్కపల్లి మండలంలో గొడిచర్ల చేరుకుంటారు. అక్కడ రాత్రి బస చేస్తారు. ఇందుకోసం గొడిచర్ల జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పదెకరాల స్థలాన్ని ఎంపిక చేశారు.

ఇక్కడ సీఎంతోపాటు ఆయన వెంట ఉండే కాన్వాయ్ వాహనాలు ఉండేందుకు వీలుగా స్థలాన్ని చదును చేశారు. సీఐలు విజయ్‌కుమార్, అప్పన్న తదితరులు సీఎం నైట్‌హాల్ట్ చేసే ప్రదేశాన్ని పరిశీలించారు. అన్ని రకాల బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.



బహిరంగ సభకు స్థల పరిశీలన చేస్తున్న వైవీ సుబ్బారెడ్డి, తలశిల రఘురామ్, బూడి ముత్యాలనాయుడు, డాక్టర్ బి.వి.సత్యవతి



సీఎం బస కోసం గొడిచర్ల వద్ద జరుగుతున్న ఏర్పాట్లు

న్యూస్‌రీల్

కేజీహెచ్‌లో అంకాలజీ ఐసీయూ ప్రారంభం




అంకాలజీ ఐసీయూని ప్రారంభిస్తున్న వైద్యారోగ్య శాఖ డీఎంఈ నరసింహం, కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్, ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

మహారాణిపేట: కేజీహెచ్ క్యాన్సర్ యూనిట్‌లో ఏర్పాటు చేసిన మెడికల్ అంకాలజీ ఐసీయూని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ డి.ఎస్.వి.ఎల్.నరసింహం గురువారం ప్రారంభించారు. అనంతరం యూనిట్‌లో పరికరాలను పరిశీలించారు. వసతుల కల్పనపై డీఎంఈ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఐసీయూని బ్లడ్ క్యాన్సర్ చికిత్సకు వినియోగించనున్నారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, క్యాన్సర్ యూనిట్ హెచ్‌వోడీ డాక్టర్ శిల్పా, ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మి తులసీ, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, ఏవో నాగేశ్వరరావు, డాక్టర్ కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వీఎన్‌సీ, ఎంఎఫ్‌సీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు

మహారాణిపేట: కేంద్రీయ మత్స్య నావిక, ఇంజినీరింగ్ శిక్షణా విభాగం ఆధ్వర్యంలో వెస్సెల్ నేవిగేటర్(వీఎన్‌సీ), మెరైన్ ఫిట్టర్(ఎంఎఫ్‌సీ) కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. రెండేళ్ల కాల పరిమితి గల ఈ కోర్సులకు విశాఖ, కొచ్చి, చెన్నై ఏరియాల్లో శిక్షణ ఉంటుంది. పదో తరగతిలో మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో 40 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులు. ఈ ఏడాది ఆగస్టు నాటికి 15 నుంచి 20 సంవత్సరాల్లోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్ల మినహాయింపు ఉంటుంది. అఖిల భారత స్థాయిలో కామన్ ఎంట్రాన్స్ టెస్ట్ నిర్వహించి సీట్లు భర్తీ చేస్తారు. దరఖాస్తులను www.cifnet.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడు చేసుకుని, జూన్ 14వ తేదీలోగా ది డైరెక్టర్, cifnet, fine arts avenue, cochin-682 016 చిరునామాకు పంపాలి.

గొలుగొండలో తేలికపాటి వర్షం



ఏఎల్‌పురంలో కురుస్తున్న వర్షం

గొలుగొండ: మండలంలో ఏఎల్‌పురం, కొంకసింగి, నాగాపురం, గొలుగొండ తదితర గ్రామాల్లో గురువారం తేలికపాటి వర్షం కురిసింది. సాయంత్రం మూడు గంటల సమయంలో కొద్దిపాటి వర్షం కురవడంతో ఈ ప్రాంతం కాస్త చల్లబడింది. తీవ్ర ఎండల ప్రభావం కారణంగా అల్లాడుతున్న ప్రజలు ఉపశమనం పొందారు.

ఫ్యాను జోరు.. కూటమి బేజారు

- నామినేషన్ల ప్రక్రియ మొదలైనా తెగని టీడీపీ సీట్ల పంచాయితీ
- మాడుగుల, అరకు నియోజకవర్గాల్లో కొనసాగుతున్న ప్రతిష్టంభన
- దక్షిణ నియోజకవర్గంలో చల్లారని 'గ్లాసు' తుపాను
- వంశీకృష్ణకు వద్దే వద్దంటున్న జనసేన నాయకులు
- గందరగోళంలో మూడు పార్టీల క్యాడర్



సాక్షి, విశాఖపట్నం: ఓ వైపు భానుడి భగభగలు.. మరోవైపు సార్వత్రిక ఎన్నికల వేడి సెగలు పుట్టిస్తుంటే.. కూటమిలో ఇంకా టికెట్ల పంచాయితీ కుంపటి రగులుతూనే ఉంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనా.. సీట్ల సర్దుబాటులో నెలకొన్న గందరగోళం కొనసాగుతూనే ఉంది. చంద్రబాబు మార్పుల వైఖరికి జనసేన, బీజేపీ నేతలు తలలు పట్టుకుంటున్నారు. మాడుగులలో సైకిల్ తొక్కేదెవరో తెలియక అయోమయంలో క్యాడర్ ఉండగా.. అరకులో కమలం వికసించకుండా టీడీపీ యత్నాలు జోరందుకున్నాయి. విశాఖ దక్షిణంలో జనసేన అభ్యర్థి వద్దేవద్దంటూ ఆ పార్టీ నేతలే తేల్చి చెబుతుండటంతో ఎటుపోవాలో తెలియక క్యాడర్ ఊగిసలాడుతోంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ తరుణంలో వైఎస్సార్ సీపీ దూకుడుగా వ్యవహరిస్తుంటే.. కూటమి మాత్రం పొత్తు చిక్కుల్లో కూరుకుపోయింది. చివరి నిమిషం వరకూ ఎవరికి సీటు దక్కుతుందో తెలియక అయోమయంలో టీడీపీ శ్రేణులు కలవరపడుతున్నారు. ముఖ్యంగా మాడుగుల, అరకు నియోజకవర్గాల్లో ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది. మాడుగులలో తొలుత పైలా ప్రసాదరావుకు చంద్రబాబు సీటు ప్రకటించారు. దీంతో ఆయన ప్రచారానికి ఇప్పటికే రూ.లక్షలు ఖర్చు చేశారు. అయితే తాజాగా ఈ సీటును తనకే కేటాయించారని బండారు ప్రకటించుకున్నారు. దీంతో పైలా వర్గం కోపంతో రగిలిపోతోంది. ఇన్నాళ్లూ ఈ టికెట్ ఆశించిన గవిరెడ్డి రామానాయుడు, పీవీజీ కుమార్‌లకు భంగపాటు తప్పలేదు. పెందుర్తి నుంచి మాడుగులకు బండారు రావడంతో అక్కడ పార్టీ క్యాడర్ రగిలిపోతోంది. మాడుగులలో గురువారం బండారు నిర్వహించిన సమావేశానికి పైలా గైర్హాజరయ్యారు. బండారు, చంద్రబాబు తీరుపై టీడీపీ శ్రేణులు ఆగ్రహంతో పాటు అయోమయానికి గురవుతున్నారు.

అరకులోనూ అదే దుస్థితి

రాష్ట్రంలోనే మొట్టమొదట ప్రకటించిన టీడీపీ సీటు అరకు నియోజకవర్గానిదే. దొన్ను దొర అరకు అభ్యర్థి అంటూ బాబు ప్రజాగళం సభలో ప్రకటించారు. అప్పటి నుంచి ప్రచారం నిర్వహించిన దొన్ను దొరకు చివరికి భంగపాటు తప్పలేదు. ఆ స్థానాన్ని బీజేపీకి ఇస్తున్నట్లు బాబు ప్రకటించడంతో అసమ్మతి భగ్గుమంది. వెన్నుపోటు పొడిచిన చంద్రబాబుకు తన తడాఖా చూపిస్తానంటూ దొన్నుదొర బహిరంగంగా సవాల్ విసిరారు. దీంతో అరకులో కూటమి రెండు ముక్కలైంది. బీజేపీ అభ్యర్థితో పాటు నడవాలా..? రెబల్‌గా అడుగులు వేస్తున్న దొన్ను దొరతో ఉండాలా అని తేల్చుకోలేక మూడు పార్టీల క్యాడర్ గందరగోళంలో ఉంది. మరోవైపు అరకులో కమలం వికసించకుండా ఆపేందుకు టీడీపీ యత్నాలు కొనసాగిస్తూనే ఉంది.

జనసేనది ఇదే పరిస్థితి

అటు జనసేనకు సంబంధించి దక్షిణ నియోజకవర్గంలోనూ అసమ్మతి ఇంకా కొనసాగుతోంది. బీఫారం దక్కించుకున్న వంశీకృష్ణకు సీటు ఇవ్వొద్దంటూ పలువురు నేతలు ఇంకా పోరాటం చేస్తూనే ఉన్నారు. వంశీని కొనసాగిస్తే.. ఓడించి తీరుతామంటూ తేల్చి చెబుతున్నారు. జనసేనలోనే వర్గపోరు ఉండటంతో.. ప్రచారానికి వెళ్లకుండా ఆ పార్టీ శ్రేణులు ఇంటికే పరిమితమవుతున్నారు. కీలక నేతలు ప్రచారానికి డుమ్మా కొడుతుండటంతో.. వారు లేకుండా ప్రచారానికి వెళ్తే.. తమని బ్లాక్ లిస్టులో పెడతారేమోనన్న సంకట స్థితిలో మూడు పార్టీల క్యాడర్‌లో ఉంది. బయటికి రాలేక.. నియోజకవర్గంలో తిరగలేక.. నాయకులు సైతం అందుబాటులో ఉండకపోవడంతో ఆయా పార్టీల పరిస్థితి కుక్కలు చింపిన విస్తరిలా మారింది. మొత్తానికి టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య పొత్తు పొడిచినా.. అది మునిగిపోయే పడవ మాత్రమేననే తత్వం ఆ పార్టీల కార్యకర్తల్లోనూ బలంగా నాటుకుంది.

ఎన్నికల ఫిర్యాదులపై తక్షణ చర్యలు

- పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు సంజయ్‌గాంధీ



కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు ఎస్.సంజయ్‌గాంధీ

తుమ్మపాల: కమాండ్ కంట్రోల్ రూమ్ 24 గంటలూ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం షిఫ్టుల వారీగా సిబ్బందిని నియమించాలని పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు ఎన్.సంజయ్ గాంధీ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి, అనకాపల్లి, మాడుగుల, చోడవరం నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు ఆశిష్‌కుమార్ పాండ్యతో కలిసి గురువారం సంజయ్‌గాంధీ పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా అందించే సేవలు, ఎన్నికల నిబంధనల అతిక్రమణలపై వచ్చిన ఫిర్యాదులపై తీసుకుంటున్న చర్యలను తెలుసుకున్నారు. ఇక్కడ ఏర్పాటుచేసిన కాల్‌సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులపై ఆరా తీశారు.

ఎన్నికల నిబంధనల అతిక్రమణపై ఫిర్యాదులను 24 గంటలూ స్వీకరించాలని, వాటిపై తక్షణమే స్పందించి పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో అన్ని పోలింగ్ కేంద్రాల నుంచి కంట్రోల్ రూమ్‌కు కమ్యూనికేషన్ అందుతోందా లేదా అనే అంశాలపై ఇన్‌చార్జ్ మత్స్యశాఖ ఏడీ పి.ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎక్స్‌పెండీచర్ మానటరింగ్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, వాహనాల పర్యవేక్షణ (జీపీఎస్ ట్రాకింగ్), వెబ్ క్యాస్టింగ్, మీడియా మానటరింగ్, సోషల్ మీడియా మానటరింగ్, కంప్లైంట్స్ మానటరింగ్ విభాగాల పనితీరును నిశితంగా పరిశీలించారు. జిల్లాలో జరిగే ఎన్నికల ప్రక్రియ మొత్తం ఇక్కడి నుంచి గమనించవచ్చని ఇన్‌చార్జ్ ప్రసాద్ తెలిపారు. జిల్లా అధికారుల పర్యవేక్షణ ఉండే కంట్రోల్ రూమ్‌లో వివిధ శాఖల్లో నిపుణులైన సిబ్బందిని ఎంపికచేసి నియమించినట్టు తెలిపారు.

కాల్ సెంటర్‌లో టోల్ ఫ్రీ నంబర్.1950, ల్యాండ్ లైన్ నంబర్ 08924 226599కు వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కమ్యూనికేషన్ కంట్రోల్ రూమ్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ విభాగం వీడియో వీవింగ్ టీమ్ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల కోడ్‌ను గమనించి చర్యలకు సిఫారసు చేస్తారని వివరించారు. జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా వాహనాల గమనాన్ని పరిశీలించడం జరుగుతుందన్నారు. మీడియా మానటరింగ్ సెంటర్‌లో పత్రికలు, టీవీ చానళ్లలో వచ్చే వార్తలు, స్క్రోలింగులు, ఇతర సమాచారం రికార్డు చేస్తున్నట్టు ఎంసీసీ నోడల్ అధికారి జి.వి.లక్ష్మి చెప్పారు. పార్టీలు, అభ్యర్థుల వ్యయాన్ని లెక్కించే విధానాన్ని కోఆపరేటివ్ ఆడిట్ అధికారి సుబ్రమణ్యం తెలిపారు.

22న ముత్యాలనాయుడు నామినేషన్



సమావేశంలో మాట్లాడుతున్న మలసాల భరత్‌కుమార్, చిత్రంలో ఎంపీ సత్యవతి, దిలీప్‌కుమార్

అనకాపల్లి: ఈనెల 22వ తేదీన ఉప ముఖ్యమంత్రి, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ వేయనున్నట్టు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ చెప్పారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 24న తాను నామినేషన్ వేస్తానని తెలిపారు. ఈనెల 20న జిల్లాలో జరగనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని, గొబ్బూరు వద్ద బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. ఎంపీ బీవీ సత్యవతి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారానికి గ్రామాల్లో ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణఅప్పారావు, వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనర్సింహం, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పలకా సత్యనారాయణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఎయిర్‌పోర్టు దూకుడు!

- 27 లక్షలు దాటిన ప్రయాణికులు
- గత ఏడాది కంటే 10.19 శాతం పెరుగుదల



సాక్షి, విశాఖపట్నం: ప్రయాణికుల తాకిడిలో విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం దూకుడులో ఉంది. ఏటికేడాది ఈ ఎయిర్‌పోర్టు నుంచి ప్రయాణికుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. తాజాగా 2023–24 ఆర్థిక సంవత్సరంలోనూ అదే తీరును కనబరిచింది. 2022–23లో ఈ విమానాశ్రయం నుంచి 25,00,654 మంది రాకపోకలు సాగించగా, ఈ సంవత్సరం 27,84,428కు పెరిగారు. గతేడాదితో పోల్చుకుంటే 2,85,974 మంది అధికంగా ప్రయాణించారు. అంటే 10.19 శాతం వృద్ధి రేటు నమోదైంది. కాగా 2022–23లో దేశీయ ప్రయాణికులు 24,35,320 మంది, విదేశీ ప్రయాణికులు ఉండగా, 2023–24లో దేశీయ ప్రయాణికులు 27,18,314, విదేశీ ప్రయాణికులు 66,116 మంది ఉన్నారు. ఈ లెక్కన గత ఏడాదికంటే స్వదేశీ ప్రయాణికులు 2,83,774 మంది, విదేశీ ప్రయాణికులు 2,982 మంది పెరిగారన్న మాట! గత మే నెలలో అత్యధికంగా 2,96,628 మంది, అత్యల్పంగా ఫిబ్రవరిలో 1,96,013 మంది ప్రయాణాలు సాగించారు. మరోవైపు ఈ విమానాశ్రయం నుంచి దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులు కూడా పెరుగుతున్నాయి. ఈ నెల 9న విశాఖ నుంచి బ్యాంకాక్‌కు కొత్త అంతర్జాతీయ సర్వీసు, 16న హైదరాబాద్‌కు రెండు సర్వీసులు ప్రారంభమయ్యాయి. ఈనెల 26న మలేసియాకు మరో కొత్త విమాన సర్వీసును ప్రారంభించనున్నారు. అలాగే పెరుగుతున్న ప్రయాణికులు, విమాన సర్వీసులను దృష్టిలో ఉంచుకుని ఈ ఎయిర్‌పోర్టులో మరిన్ని సదుపాయాలను సమకూరుస్తున్నారు. ప్రయాణ ప్రక్రియ వేగవంతం, సులభతరమయ్యేందుకు వీలుగా ఇన్‌లైన్ బ్యాగేజి స్క్రీనింగ్, డిజి యాత్ర సర్వీసును అందుబాటులోకి తెచ్చారు. ప్రయాణికుల రాకపోకల్లో విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం మూడు మిలియన్ల (30 లక్షల) మైలు రాయిని అధిగమిస్తుందని ఆంధ్రప్రదేశ్ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కె.కుమార్‌రాజా, ఒ.నరేష్‌కుమార్, డీఎస్ వర్మ తెలిపారు.

బొగ్గు సంక్షోభం నివారణకు వేగంగా చర్యలు



స్టీల్‌ప్లాంట్ ముఖచిత్రం

ఉక్కునగరం: బొగ్గు సంక్షోభం నివారణకు వేగవంతమైన చర్యలు చేపట్టినట్లు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం గురువారం ప్రకటించింది. అదానీ గంగవరం పోర్ట్ కార్మికుల ఆందోళన నేపథ్యంలో ఏర్పడిన బొగ్గు కొరత నివారణకు తీసుకుంటున్న చర్యలను స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ వివరించారు. పోర్టులో కొంత బొగ్గుతో పాటు అదానీ పోర్టు వద్దకు చేరిన లక్షన్నర టన్నుల కోకింగ్ కోల్ ఉన్న నౌకలు బెర్తింగ్ కోసం ఎదురు చూస్తున్నాయన్నారు. పోర్టులో ఉన్న దాదాపు 2.2 లక్షల టన్నుల బొగ్గును తీసుకురావడం కోసం జిల్లా పరిపాలన వ్యవస్థ సహాయాన్ని కోరామన్నారు. అదానీ పోర్టు బయట ఉన్న రెండు నౌకలను వైజాగ్ పోర్టుకు మళ్లించడం, ప్రత్యామ్నాయ ఓడరేవుల నుంచి 50 వేల టన్నుల బొగ్గును రుణం తీసుకోవడం, లక్షన్నర టన్నుల బొగ్గు అత్యవసర సేకరణ కోసం గ్లోబల్ టెండర్‌కు వెళ్లడం వంటి చర్యలను తీసుకుంటున్నట్లు వివరించారు. తాజా పరిస్థితిని అధిగమించడానికి, పరిష్కారాల కోసం స్టీల్‌ప్లాంట్ దృఢసంకల్పంతో కృషి చేస్తోందన్నారు.

డేటా లింక్ బ్రిడ్జ్ టెక్నాలజీలో ఏయూకు పేటెంట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ ఆచార్యులు డి.లలితభాస్కరి, పరిశోధక విద్యార్థి డాక్టర్ ఎస్.కె.ఎ.మనోజ్‌లకు ఇండియన్ పేటెంట్ ఆఫీస్ పేటెంట్ మంజూరు చేసింది. వారు కొత్తగా అభివృద్ధి చేసిన డేటా లింక్ బ్రిడ్జ్ టెక్నాలజీకి పేటెంట్ సాధించారు. ఈ విధానంలో అత్యంత భద్రతలో సమాచారాన్ని పంపే అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా ఆచార్య లలిత భాస్కరిని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో గురువారం అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, డీపీఐఐటీ–ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బయ్యవరంలో హీరో సాయిరాం ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సాయిరాంశంకర్

మాకవరపాలెం : మండలంలో రెండో రోజు కూడా సినీ హీరో, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సోదరుడు సాయిరాం శంకర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బయ్యవరం గ్రామంలో గురువారం రాత్రి స్థానిక సర్పంచ్ లాలం కాశీ విశ్వనాథ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుకల శ్రీనుతో కలసి ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. సాయిరాంశంకర్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలబడి, ఈ ఎన్నికల్లో మరలా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. నర్సీపట్నం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే ఉమాశంకర్‌ను గెలిపించాలని కోరారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సచివాలయాల మండల కన్వీనర్ చిటికెల రమణ, జిల్లా కార్యదర్శి గోవిందరావు, మండల యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, మండల సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు జె.కె.రాజు పాల్గొన్నారు.

ప్రచార పర్వం

ఎన్నికల నోటిఫికేషన్ రావడంతోనే అభ్యర్థుల ప్రచారం ఊపందుకుంది. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. గడపగడపనూ సందర్శించి ఓటర్లను ఆప్యాయంగా పలకరించి ఆకట్టుకుంటున్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్నారు.



చల్లగా దీవించండి : బుచ్చెయ్యపేట మండలం గున్నెంపూడిలో ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న ప్రభుత్వ విప్, చోడవరం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ



'గుర్తు'ంచుకోండి : నర్సీపట్నం మున్సిపాలిటీలో మహిళకు ఫ్యాన్ గుర్తు చూపుతున్న ఎమ్మెల్యే గణేష్



అవ్వా నీ ఓటు నాకే : కె.కోటపాడు మండలం మేడిచర్లలో వృద్ధురాలిని పలకరించి ఓటు అభ్యర్థిస్తున్న మాడుగుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ



ఆదరించి ఆశీర్వదించండి : సత్యవరం గ్రామంలో ఓటర్లకు నమస్కరిస్తూ ప్రచారం సాగిస్తున్న పాయకరావుపేట వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంబాల జోగులు

కూటమి నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు



కంబాల జోగులు సమక్షంలో పార్టీలో చేరిన సత్యవరం గ్రామస్తులు



జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, ఎంపీ బీవీ సత్యవతి

పాయకరావుపేట : మండలంలో గల సత్యవరం గ్రామానికి చెందిన టీడీపీ జనసేన పార్టీల కార్యకర్తలు 10 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. సత్యవరం గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. గ్రామ సర్పంచ్ సకిలేటి రాము ఆధ్వర్యంలో వీరందరికీ అభ్యర్థి కంబాల జోగులు పార్టీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోనికి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన కాకాడ పవన్ కుమార్, కాకాడ నరేష్, కందేల నాగబాబు, తుమ్మలపల్లి గోవిందు, కాకాడ వెంకటకృష్ణ, పడిది పండు, కందేల శ్రీను, అనంతరపు చిన్నబ్బాయి, తుమ్మలపల్లి రాము, తుమ్మలపల్లి అచ్చారావు లకు ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు సాదరంగా పార్టీ కండువాలు వేసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై తామందరం పార్టీలోకి చేరినట్లు తెలిపారు.

జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి

అనకాపల్లి : తగరంపూడి గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు వైఎస్సార్‌సీపీలోకి గురువారం రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో చేరారు. వీరికి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, ఎంపీ బీవీ సత్యవతి 15 మంది జనసేన నేతలకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తగరంపూడి జనసేన నేత యాదగిరి విజయ్ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి జనసేన పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేసేవాడినని కూటమి వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడంతో జనసేన పార్టీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరడం జరిగిందన్నారు. తగరంపూడి నుంచి మరో 25 మంది జనసేన వారు మూడు నాలుగు రోజుల్లో పార్టీలోకి చేరుతారని తెలిపారు. వైస్ ఎంపీపీ అయిత రాము ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పెడిశెట్టి గోవింద్ పాల్గొన్నారు.

సుందరపు విజయ్‌కుమార్‌పై 9 క్రిమినల్ కేసులు

- తన పేరున రూ.6.39 కోట్ల ఆస్తులు, భార్య పేరున రూ.53.72 లక్షలు
- ఎన్నికల అఫిడవిట్‌లో వివరాలు వెల్లడి

యలమంచిలి రూరల్ : జనసేన యలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా గురువారం నామినేషన్ దాఖలు చేసిన సుందరపు విజయ్ కుమార్ తనతోపాటు కుటుంబ సభ్యుల ఆస్తులు, అప్పులు, ఆదాయాలు, క్రిమినల్ కేసుల వివరాల అఫిడవిట్లు సమర్పించారు. ఈ అఫిడవిట్ పరిశీలిస్తే కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. సుందరపు విజయ్‌కుమార్‌పై మొత్తం 9 క్రిమినల్ కేసులున్నాయి. విశాఖపట్నం ఎయిర్ పోర్ట్ పోలీస్‌స్టేషన్‌లో రెండు, నవీ ముంబై రాబాలె ఎంఐడీసీ పోలీస్‌స్టేషన్‌లో, విశాఖ పీఎంపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఒకటి, అచ్యుతాపురం పోలీస్‌స్టేషన్‌లో రెండు, రాంబిల్లి పోలీస్‌స్టేషన్‌లో ఒకటి, హరియానా రాష్ట్రం, సోనోపేట, రాయ్ పోలీస్‌స్టేషన్‌లో ఒకటి, విశాఖ టూటౌన్ పీఎస్‌లో ఒకటి మొత్తం 9 క్రిమినల్ కేసులు ఉన్నాయి. వీటిలో కొన్ని వివిధ దశల్లో ఆయా కోర్టుల్లో విచారణలో ఉన్నట్టు, మరికొన్ని కేసుల విచారణ గురించి తెలియదని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇక ఆస్తుల విషయానికొస్తే సుందరపు విజయ్‌కుమార్ వద్ద రూ.4.53 లక్షల నగదు, భార్య శైలజ వద్ద రూ.2.37లక్షల నగదు, తన పెద్ద కుమార్తె సుకీర్తి లలితా లక్ష్మీశ్రీ వద్ద రూ.36వేల నగదు ఉన్నట్టు అఫిడవిట్‌లో చూపారు. తన పేరున ఉన్న వివిధ బ్యాంకు అకౌంట్లలో రూ.3,08,367, తన భార్య పేరుతో ఉన్న బ్యాంకు అకౌంట్లలో రూ.12,86,001, ఇద్దరు కుమార్తెల పేరున అకౌంట్లలో రూ.1,59,403 నగదు ఉందని పేర్కొన్నారు.

తన పేరున రూ.20,887, తన పెద్ద కుమార్తె పేరున రూ.5 లక్షలు, చిన్న కుమార్తె పేరుతో రూ.4,44,444 విలువ చేసే జీవిత బీమా పాలసీలు ఉన్నాయి. సుందరపు పేరున 2014లో కొనుగోలు చేసిన రూ.2,61,826 విలువ గల మహీంద్రా బొలెరో మేక్సీ ట్రక్ ఉంది. తన వద్ద 101 గ్రాములు, తన భార్య వద్ద 567 గ్రాములు, పెద్ద కుమార్తె వద్ద 232 గ్రాములు, చిన్న కుమార్తె వద్ద 209 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నాయి. వైజయంతి ఇన్‌ఫ్రాలో కేపిటల్ నిల్వ రూ.3,81,51,950 ఉంది. మొత్తంగా సుందరపు విజయ్‌కుమార్ చరాస్తుల విలువ రూ.3,98,81,820, భార్య శైలజ చరాస్తి విలువ రూ.53,72,931, పెద్ద కుమార్తె వద్ద రూ.22,47,713, చిన్న కుమార్తె వద్ద రూ.18,86,524 విలువ చేసే చరాస్తులున్నాయి.

రూ.2.40 కోట్ల స్థిరాస్తులు

సుందరపు విజయ్‌కుమార్ పేరిట రూ.2,40,30,000 విలువ చేసే మూడు నివాస గృహాలున్నాయి. వీటిలో విశాఖ రుషికొండ ఎంకే మేడోస్ లేఅవుట్‌లో 1790 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన రెండు ప్లాట్లు, అచ్యుతాపురం చోడపల్లిలో 4500 చదరపు అడుగుల విస్తీర్ణంలో మరొక ప్లాట్ ఉన్నాయి. అలాగే రూ.1,89,34,612 బ్యాంకు రుణాలున్నాయి. వీటిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో రూ.48,38,984 విలువ కలిగిన రెండు, పీఎన్‌బీలో రూ.92,56,644 ఒకటి హౌసింగ్ లోన్లు ఉన్నాయి. సొంత కార్లు లేనట్టు ఎన్నికల అఫిడవిట్‌లో చూపారు.

జె.పి.అగ్రహారం ఇనాం భూములపై పిటిషన్ కొట్టివేత



రోడ్డు పక్కన సాగు భూములు

రోలుగుంట: మండలంలోని జె.పి.అగ్రహారంలో ఇనాం భూ పంపిణీ సక్రమంగా లేదని గ్రామానికి చెందిన దుంగల శ్రీను, కొంతమంది రైతులు కలసి వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. అధికారులకు లభ్యమైన రెవెన్యూ రికార్డుల ఆధారంగా ఇనాం భూముల పంపిణీ సక్రమమేనని ఈ నెల 16న తీర్పు వెలువరించిందని ప్రభుత్వ న్యాయవాది సి.సుబోధ్ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే... రెండు శతాబ్దాల క్రితం విజయనగరం రాజుల ఆధీనంలో ఉండే సర్వే నంబర్ 1 నుంచి 93 వరకూ సాగుభూమి, చెరువులు, రోడ్డు, పోరంబోకు గోర్జుతో కలిపి 408 ఎకరాలను సాగు చేయడం ద్వారా వచ్చే ఆదాయాన్ని నక్కపల్లి మండలం ఉపమాక వేంకటేశ్వర ఆలయాభివృద్ధికి వెచ్చించడంతోపాటు ధూప, దీప నైవేద్యం తదితర సేవల కోసం కొంతమంది వైష్ణవులకు అప్పగించారు. వైష్ణవుల వద్ద ఉన్నవాటిని వారి కుటుంబీకులు కొనుగోలు చేసుకుని 2017లో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వి.వి.వి నాగవర్మ మరో ఎనిమిది మందికి విక్రయించారు. వీరి పేరున మ్యూటేషన్ ఆధారంగా పట్టాదారు పాస్‌పుస్తకాలు తప్పుగా జారీ చేశారని, 1950 ఆర్డరు ప్రకారం ఈనాం భూమి కాదని, గ్రామానికి చెందిన దుంగల ఎర్రాపాత్రుడు, దుంగల శ్రీను 2022 హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై రెండేళ్ల పాటు సాగిన వాదనల అనంతరం ఈ నెల 16న హైకోర్టు పిటిషన్ కొట్టివేస్తూ.. జానకిరాంపురం అగ్రహారం ఈనాం గ్రామమని, కోర్టు ఆర్డరు ప్రకారం 1976లో సెటిల్ అయిందని స్పష్టం చేసిందని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు.

103 మంది వలంటీర్ల రాజీనామా



రాజీనామా చేసిన మామిడివాడ వలంటీర్లు



పంచాయతీ కార్యదర్శికి రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు

రాంబిల్లి : మండలంలో 11 సచివాలయాల పరిధిలో గల 103 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. గురువారం వీరంతా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.వెంకటాచలంకు రాజీనామా లేఖలు అందజేశారు. దీంతో ఇప్పటివరకు 242 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్టు ఎంపీడీవో తెలిపారు. వలంటీర్లు విధులకు దూరంగా వుండాలని ఎన్నికల సంఘం ఆదేశించడం, ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంలో ప్రతిపక్ష పార్టీల అధినేతల ప్రమేయం ఉందని పలువురు వలంటీర్లు ఆరోపించారు. ఇది సరికాదని, దీంతో తాము రాజీనామా చేస్తున్నామని వలంటీర్లు పేర్కొన్నారు.

చౌడువాడలో 33 మంది..

కె.కోటపాడు : చౌడువాడ గ్రామ పంచాయతీకి చెందిన 33 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి ఎస్.రామునాయుడుకు అందించారు. వలంటీర్ల సేవలపై మాజీ సీఎం చంద్రబాబు చేస్తున్న వ్యాఖ్యలకు నిరసనగా రాజీనామా చేయడంతో తమకు ఉపాధి కల్పించిన సీఎం జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు కృతనిశ్చయంతో పని చేయనున్నట్టు వలంటీర్లు పేర్కొన్నారు. మాడుగుల ఎమ్మెల్యేగా ఈర్లె అనురాధ, ఎంపీ బూడి ముత్యాలనాయుడును గెలిపించుకునేందుకు పని చేయనున్నట్టు రాజీనామా చేసిన వలంటీర్లు పార్వతీశం, రమేష్, అంజి, శివ, రామునాయుడు తదితరులు తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండిళ్లు దగ్ధం

- రూ.2లక్షలకు పైగా ఆస్తినష్టం



అగ్ని ప్రమాదంలో కాలిబూడిదైన ఇళ్లను పరిశీలిస్తున్న ఆర్ఐ హరి, వీఆర్వో బొత్స శ్రీను

నాతవరం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా తాటాకు ఇళ్లు దగ్ధమవడంతో సుమారు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం కలిగిందని ఆర్ఐ హరి గురువారం తెలిపారు. మండలంలో సరుగుడు రెవెన్యూ శివారు సుందరకోట గ్రామంలో బుధవారం రాత్రి విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో గిరిజనులు నివాసం ఉంటున్న రెండు తాటాకు ఇళ్లు కాలిపోయాయి. ఆ ఇళ్లలో కూడా బ్రహ్మం, కూడా వెంకయ్యమ్మ, కూడా రాజులమ్మ, జాంపా వెంకయ్యమ్మ కుటుంబ సభ్యులు నివాసం ఉంటున్నారు. విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు వ్యాపించి క్షణాల్లోనూ ఇంట్లోని విలువైన వస్తువులు, నిత్యవసర సరుకులు పూర్తిగా కాలిపోయాయని బాధితులు తెలిపారు. గురువారం ఉదయం ఆర్ఐ హరి, వీఆర్వోల బొత్స శ్రీను సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆస్తి నష్టం అంచనా వేశారు. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న రేట్ల ప్రకారం లెక్కిస్తే ఆస్తి నష్టం రూ. 2 లక్షలకు పైగా ఉంటుందని రెవెన్యూ అధికారులు తెలిపారు. సంఘటన స్థలంలో పరిశీలించిన అంశాలతో పాటు బాధితులు చెప్పిన వివరాలను ఉన్నతాధికారులను నివేదిస్తామన్నారు.

రెండు గ్రామాల్లో సారా బట్టీల ధ్వంసం



దిబ్బ గ్రామంలో సారా బట్టీ ధ్వంసం చేస్తున్న ఎస్ఐ

రావికమతం : దిడ్డి,కసిరెడ్డిపాలెం గ్రామ శివార్లలో సారా తయారీ చేసేందుకు సిద్ధంగా ఉన్న 1,900 లీటర్ల పులుపును, పెద్ద ఎత్తున పరికరాలను ధ్వంసం చేశామని రావికమతం ఎస్ఐ ధనంజయ్‌నాయుడు గురువారం తెలిపారు. ఆయన కథనం మేరకు ఆ గ్రామంలో సారా విక్రయాలు జరుగుతున్నట్టు తమకు ముందస్తు సమాచారం అందడంతో సిబ్బందితో పాటు దాడులు చేశామన్నారు. గ్రామ శివారు కొండపై సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1,900 లీటర్ల పులుపును,పెద్ద ఎత్తున సామగ్రిని ధ్వంసం చేశామన్నారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం

మాడుగుల రూరల్ : వీరవల్లి అగ్రహారం పంచాయతీ శివారు లక్ష్మీపురం గ్రామంలో విద్యుత్ షార్టు సర్క్యూట్ వల్ల గురువారం గడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది. ట్రాక్టరుతో గడ్డి తీసుకెళ్తుండగా లక్ష్మీపురం గ్రామం వద్ద విద్యుత్ వైర్లు తగిలాయి. ఈ ప్రమాదంలో సుమారు లక్ష రూపాయలు ఆస్తి నష్టం వాటిల్లిందని మాడుగుల అగ్ని మాపక కేంద్రం దళాధికారి వి.రాజేశ్వరావు తెలిపారు. సకాలంలో అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఇంజిన్‌తో మంటలను ఆర్పివేసినట్టు రాజేశ్వరావు తెలిపారు. సిబ్బంది రాజేశ్వరావు, బోగేశ్వరావు, మణికుమార్, మదీనా, వరహాలు పాల్గొన్నారు.

అధిష్టానం ఆదేశాలతో మాడుగుల నుంచి పోటీ

- మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

మాడుగుల/రూరల్: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు మాడుగుల నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో దిగుతున్నట్లు మాజీ మంత్రి, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. గురువారం ఆయన ముకుందపురం జంక్షన్ నుంచి తన పార్టీ శ్రేణులతో బైక్ ర్యాలీగా వెళ్లి మాడుగుల మోదకొండమ్మను దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుంచి గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పి.వి.జి. కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు హాజరయ్యారు.

పైలా వర్గం గైర్హాజరు...

మాడుగుల నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా పైలా ప్రసాదరావుకు 20 రోజుల క్రితం టికెట్ ఖరారు చేయడంతో తన కేడర్‌తో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బండారుకు టికెట్ అప్పగించడంతో వారంతా షాక్‌కు గురయ్యారు. బైక్ ర్యాలీకి గైర్హాజరయ్యారు. పార్టీకి సుదీర్ఘ కాలంగా సేవలందిస్తున్న పైలా ఈ మార్పుతో బుధవారం నుంచి ప్రచారం చేపట్టలేదు.

90 మద్యం సీసాలు పట్టివేత

ఎస్.రాయవరం : దార్లపూడి గ్రామంలో ఓ మహిళ వద్ద అక్రమంగా నిల్వ చేసిన 90 మద్యం సీసాలను పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. గ్రామానికి చెందిన మహిళ వద్ద పెద్ద ఎత్తున మద్యం సీసాలు ఉన్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించామన్నారు. ఈ మద్యం బాటిళ్ల వివిధ మద్యం షాపుల నుంచి సేకరించి బెల్టు దుకాణం నిర్వహించేందుకు నిల్వ చేసినట్టు తెలిపిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మద్యం బాటిళ్లు సీజ్ చేశామన్నారు.

11 ఎకరాల్లో జీడితోట దగ్ధం



కాలిపోయిన జీడితోట

రావికమతం : కొత్తకోట గ్రామానికి చెందిన భీమరాతి మణి, శాంతి, రమణమ్మ, తంటపురెడ్డి జయ, వెచ్చా కొండమ్మ అనే ఐదుగురు రైతులకు చెందిన 11 ఎకరాల్లోని జీడి తోట ప్రమాదవశాత్తూ గురువారం కాలిపోయింది. ఆకతాయిలు, మందుబాబులు ఆ తోటల్లో తరచూ పార్టీలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో విచ్చలవిడిగా సిగరెట్లు కాలుస్తూ నిర్లక్ష్యంగా పారేస్తున్నారు. పలుమార్లు అటువంటి ఆకతాయిలను ఆ రైతులు మందలించారు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి పారేసిన సిగరెట్ అంటుకుని ఆ రైతులకు చెందిన జీడితోట కాలిపోయింది. మండే ఎండ ఆపై గాలి వీయడంతో తోటను రక్షించుకోలేక పోయామని రైతులు వాపోయారు. రావికమతం అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. లేకుంటే మరో 15 ఎకరాలకు మంటలు అంటుకుని ఉండేవన్నారు. ఈ ప్రమాదంలో బాధితులకు రూ. 6లక్షల వరకూ ఆస్తి నష్ట సంభవించిందని ప్రాథమిక అంచనా. ఈ ఏడాది జీడి బాగా కాసిందని రెండు రోజుల నుంచే పిక్క ఏరుతున్నామని ఇంతలోనే ఈ ప్రమాదం జరిగిందని రైతులు ఆవేదన చెందారు.

క్లుప్తంగా

నేడు వరాహ లక్ష్మీనృసింహ స్వామి కల్యాణోత్సవం



వరాహ లక్ష్మీనృసింహస్వామి

కశింకోట: మండల కేంద్రం కశింకోటలో ప్రసిద్ధి చెందిన వరాహ లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం శుక్రవారం రాత్రి 7 గంటలకు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు అత్తిలి సత్య వెంకట కేశవ కోదండపాణి తెలిపారు. చైత్ర శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఆలయ ఆవరణలో నృసింహస్వామి, లక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాలకు కల్యాణాన్ని వేగి తారకేశ్వరరావు, పరమేశ్వరి దంపతులతో జరిపించనున్నట్టు చెప్పారు. అనంతరం ప్రసాద వితరణ చేస్తామన్నారు. కల్యాణానికి ముందు మధ్యాహ్నం 3గంటలకు స్వామి రథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 24వ తేదీ రాత్రి 7 గంటలకు పుష్పాంజలి కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.

రేపటి నుంచి వేసవి శిక్షణ తరగతులు

అనకాపల్లి: స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో ఈనెల 20నుంచి 30వ తేదీ వరకు కల్యాణి అకాడమీ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు అకాడమీ కరస్పాండెంట్ ఇంద్రగంటి లక్ష్మీ శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సంగీతం, కూచిపూడి నాట్యం, వెస్ట్రన్ డ్యాన్స్, డ్రాయింగ్, పెయింటింగ్, కీబోర్డు, గిటార్ తదితర అంశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యార్థినీ విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు శిక్షణ ఉంటుందని, శిక్షణ అనంతరం పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు.

పీహెచ్‌సీలో చలివేంద్రం ఏర్పాటు



పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

కశింకోట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి తిరుపతిరావు ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి దృష్ట్యా కేంద్రానికి వచ్చే రోగులు, సహాయకుల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని వైద్యాధికారి తెలిపారు. వేసవిలో ఎక్కువగా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉన్నందున అవసరముంటేగాని బయట తిరగవద్దని ఆయన సూచించారు. వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

అనకాపల్లి సినిమాలు

మార్కెట్ మహాలక్ష్మి	: రాజా
పారిజాత పర్వం	: సత్యనారాయణస్క్రీన్-1
టెనెంట్	: సత్యనారాయణస్క్రీన్-2
గీతాంజలి	: షిర్డీసాయి
ఫ్యామిలీ స్టార్	: పర్తిసాయి
మంజుమ్మల్ బోయ్స్	: వెంకటేశ్వర
గుంటూరు కారం (2 షోలు)	: శ్రీసత్య
హ్యాపీడేస్(2 షోలు)	: శ్రీసత్య
డీజే టిల్లు-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 25 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-4 యూనిట్లు, ఎ నెగిటివ్-2 యూనిట్లు, బి పాజిటివ్-4 యూనిట్లు, బి నెగిటివ్-2 యూనిట్లు, ఒ పాజిటివ్-9 యూనిట్లు, ఒ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 390 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 310 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

పుచ్చకాయలకు భలే డిమాండ్

- జోరుగా అమ్మకాలు





అమ్మానికి సిద్ధంగా ఉన్న పుచ్చకాయలు

అనకాపల్లి: భానుడి భగభగల నుంచి ఉపశమనం పొందడానికి వేసవిలో ప్రజలు పుచ్చకాయలవైపు ఎక్కువగా మొగ్గ చూపుతారు. అలసిన సమయంలో ఎర్రని పుచ్చకాయ ముక్క తింటే ఆ ఆనందమే వేరు. జోన్ పరిధిలో సుంకరమెట్ట, పెరుగుబజార్, రింగ్‌రోడ్డు, నెహ్రూచౌక్, ఆర్టీసీ కాంప్లెక్స్, గాంధీనగరం తదితర ప్రాంతాల్లో పుచ్చకాయల అమ్మకాల జోరుగా సాగుతున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో భానుడి భగభగల నుంచి ఉపశమనం పొందడానికి పుచ్చకాయలవైపు అనకాపల్లి పట్టణ ప్రజలతో పాటు, మండల ప్రజలు కూడా పరుగులు తీస్తున్నారు. పట్టణంలో ప్రధాన రహదారుల పక్కన తాత్కాలిక గుడారాలు, తోపుడుబళ్లపై పుచ్చకాయల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఇవి పొరుగు రాష్ట్రాల నుంచి ఎక్కువగా దిగుమతి అవుతున్నాయి. కంటికి ఇంపుగాను, నోటికి తీయగాను అనిపించే ఈ పండు తినేవారికి ఆరోగ్యమే కాదు, శరీరంలో ఎంతో చల్లదనం లభిస్తుంది. వ్యాపారులకు ఆదాయాన్ని కూడా సమకూరుస్తుంది. తమిళనాడు, నెల్లూరు, ఒడిశా, పుదిచ్చేరి, విజయవాడ, రాజమండ్రి సమీపంలోని నెల్లజర్ల తదితర ప్రాంతాల నుంచి పట్టణానికి లారీల ద్వారా దిగుమతి చేసుకుంటున్నారు.

పట్టణ పరిధిలో ప్రధాన ఆరు హోల్‌సేల్ దుకాణాల్లో పెద్ద మొత్తంలో హోల్‌సేల్, రిటైల్‌గా పుచ్చకాయల వ్యాపారం జరుగుతోంది. రెండు మాసాల్లో సుమారుగా రూ.కోటి వరకు లావాదేవీలు జరుగుతాయి. ఇక్కడ నుంచి చుట్టుపక్కల మండలాలకు కూడా సరఫరా చేస్తుంటారు.

పుచ్చకాయలలో రకాలు

నాంధారి, ఆర్క్‌మ్యాన్, సుగర్‌బేబీ తదితర రకాలు ఉన్నాయి. నల్ల, తెల్ల, లైట్‌గ్రీన్ రంగుల్లో కాయలుంటాయి. నల్లకాయలు అన్ని కాలాల్లోనూ పండుతాయి. మన రాష్ట్రంలో విజయవాడ సమీప ప్రాంతంలో ఈ రకం కాయలు ఎక్కువగా దొరుకుతాయి. తెల్ల పుచ్చకాయలు మన రాష్ట్రంలో నెల్లూరు, తమిళనాడు రాష్ట్రంలో చెన్నై నుంచి దిగుమతి చేసుకుంటారు. ప్రస్తుతం కిలో ధర రూ.30 నుంచి రూ. 50 మధ్య పలుకుతోంది. కొన్ని ప్రాంతాల్లో కాయ సైజును బట్టి రూ.వంద నుంచి రూ.మూడు వందల మధ్య ధర పలుకుతోంది. ముక్కలు కోసినవి అయితే రూ. 10, రూ.20 చొప్పున అమ్ముతారు.

వ్యాపారం బాగుంది...



పుచ్చకాయల వ్యాపారం బాగా సాగుతోంది. సుమారు ఐదు నెలలు వ్యాపారం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో నష్టమూ వస్తుంది. అన్ని పుచ్చకాయలు ఒకేలా ఉంటాయని చెప్పలేం.పైకి బాగానే కనిపిస్తాయి కొన్ని కాయలు లోపల పాడైపోతాయి. అటువంటి సందర్భాల్లో కొద్దిగా నష్టం కూడా వస్తుంది. మొత్తం మీద వ్యాపారంబాగానే ఉంటుంది. ఐదు సంవత్సరాల నుంచి వ్యాపారం చేస్తున్నాను.

– శ్రీను, అనకాపల్లి

ఆరోగ్యానికి చాలా మంచిది

వేసవి కాలంలో వేడి ఉష్ణోగ్రత వల్ల మానవుని శరీరంలో నీరు చెమట రూపంలో పోతుంది. అటువంటి సమయంలో ఎక్కువగా నీరు తాగడంతో పాటు వివిధ రకాల పళ్ల జ్యూసులు తీసుకోవాలి. 92శాతం నీటితో నిండిన వంద గ్రాముల పుచ్చకాయ 46 క్యాలరీల శక్తిని శరీరానికి అందిస్తుంది. 170 మిల్లీ గ్రాముల పొటాషియం, 7.6 గ్రాముల పిండి పదార్థాలు, 26 మిల్లీ గ్రాముల విటమ్ ఎ, 12 మిల్లీ గ్రాముల విటమిన్ సి, 0.1 మిల్లీ గ్రాముల విటమిన్ బి, 0.6 గ్రాముల ప్రోటీన్ కలిగి ఉంటుంది. శరీరంలో కొలస్ట్రాల్‌ను తగ్గించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– వాణి జగదీశ్వరి తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యురాలు

గవరల అభివృద్ధికి సీఎం జగన్ అధిక ప్రాధాన్యం



కాశీవిశ్వనాథంను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: గవర సామాజిక వర్గ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యం ఇచ్చారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు బొడ్డేడ కాశీవిశ్వనాథం తెలిపారు. స్థానిక రింగ్ రోడ్డు పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, ఎంపీ బి.వి.సత్యవతిలను గురువారం ఆయన మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా కాశీవిశ్వనాథంను దుశ్శాలువాతో ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్ సత్కరించారు. అనంతరం కాశీవిశ్వనాథం మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి గ్రామీణ స్థాయి నుంచి శక్తివంచన లేకండా కృషిచేస్తున్నట్టు తెలిపారు. పార్టీ ప్రచార కార్యక్రమాలు విస్తృత స్థాయిలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనకాపల్లి: విద్యుత్ లైన్ల మరమ్మతుల పనుల నిమిత్తం మండలంలోని పలు ప్రాంతాల్లో ఈనెల 19, 20 తేదీల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నారు. కొత్తూరు పరిధిలో పిసినికాడ, సత్యానారాయణపురం, మూలపేట, వేట జంగాల పాలెం, సంపతిపురం, కుంచంగి, కూండ్రంలలో శుక్ర,శనివారాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు కశింకోట డివిజన్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. గాంధీనగరం విద్యుత్ శాఖ డి-1 సెక్షన్ పరిధిలో లక్ష్మీదేవిపేట, గాంధీనగరం, మిరియాల కాలనీ, ఆర్‌అండ్‌బీ బంగ్లా ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం 3.30 నుంచి 6.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ కె.రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు.

కశింకోట: మండలంలోని బయ్యవరం, నరసింగబిల్లి, కన్నూరుపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈఈ ఎస్. రామకృష్ణ, ఏఈ పి.శ్రీనివాసరావు వేర్వేరుగా తెలిపారు. బయ్యవరం సబ్ స్టేషన్ పరిధిలో కశింకోట, బయ్యవరం, విసన్నపేట, రామన్నపాలెం గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు చెప్పారు. నరసింగబిల్లి సబ్ స్టేషన్ పరిధిలో నరసింగబిల్లి, కన్నూరుపాలెం సబ్ స్టేషన్ల పరిధిలో నూతల గుంటపాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, కొత్తపల్లి, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, ఎఎస్ పేట, సోమవరం, కన్నూరుపాలెం, తీడ, చెరకాం, సుందరయ్యపేట, జి. భీమవరం, అచ్చెర్ల, మోసయ్యపేట, ఏనుగుతుని గ్రామాలను ఉదయం 6.30 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

హోమ్ పోలింగ్‌పై దృష్టి సారించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

మునగపాక : హోమ్ పోలింగ్‌పై అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సూచించారు. గురువారం సాయంత్రం ఆయన ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 85 సంవత్సరాలు పైబడి అనారోగ్యంతో బాధపడే వారు, దివ్యాంగుల ఇంటికి వెళ్లి ఓటు వేసే ప్రక్రియ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లకు సంబంధించి సమన్వయం చేసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు అందరూ కృషి చేయాలన్నారు. తహసీల్దార్ పి.పాపారావు, ఎంపీడీవో మన్మథరావు, డీటీ వినయ్ కుమార్, ఈవోఆర్డీ వెంకటలక్ష్మి తదితరులు కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

విద్యార్థులకు విద్యతో పాటు ఆట పాటలు



విద్యార్థులతో లెక్కలు చేయిస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: విద్యార్థులకు బోధనతోపాటు ఆట పాటలు నేర్పించాలని ఎంపీడీవోజాగరపు రాంబాబు తెలిపారు. ఎం.బి.పట్నం హైస్కూల్ ఎలిమెంటరీ పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొంతమంది విద్యార్థులతో బోర్డుపై లెక్కలు చేయించారు. తర్వాత మధ్యాహ్న భోజనం రుచి చూశారు. ఇక్కడ ప్రధాన సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ గ్రామంతోపాటు గన్నవరంలో సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఇక్కడ ఎన్నికల చెక్ పోస్టును సందర్శించారు. పంచాయతీ కార్యదర్శులు చినబాబు షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

సంతకు సన్‌స్ట్రోక్



బోసిపోయిన కశింకోట వారపు సంత

కశింకోట: ఎండ తీవ్రత కారణంగా స్థానిక వారపు సంత గురువారం వెలవెలబోయింది. ఉదయం 11 గంటల ప్రాంతం నుంచి ప్రజలు బయటకు రావడానికి సాహసించలేదు.

దీంతో కాయగూరలు, ఆకు కూరలు, మసాల దినుసులు, పండ్ల దుకాణాల వద్ద కొనుగోలుచేసే వారు కరవయ్యారు.

వ్యాపారులు కూడా ఎండకు తట్టుకోలేక దుకాణాలు విడిచి నీడ పట్టుకు వెళ్లిపోయారు. దీంతో సంత జరిగే ప్రధాన పంచాయతీ రహదారిలో దుకాణాలు బోసిపోయాయి. మధ్యాహ్నం 3 గంటల తర్వాత వాతావరణం చల్లబడడంతో యథావిధిగా వ్యాపారాలు సాగాయి.

కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. కిలో ఉల్లి, టమాటా, బంగాళాదుంప రూ.30, బెండకాయ, దొండకాయ, గోరు చిక్కుడు, క్యాబేజీ రూ.40, క్యారెట్, బీట్రూట్, బీరకాయ, పచ్చిమిరప రూ.60 చొప్పున విక్రయాలు సాగాయి.

నేడు ఆరోగ్య సురక్ష శిబిరం

కశింకోట: మండలంలోని అమీన్‌సాహెబ్‌పేట లో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్టు తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యు.రమేష్ తెలిపారు. అక్కడి ప్రాథమిక స్కూలులో ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందన్నారు. ప్రత్యేక వైద్య నిపుణులు, పీహెచ్‌సీ వైద్యులు పది రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహించి, మందులు అందజేయనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని అమీన్‌సాహెబ్‌పేట సచివాలయ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 26న తాళ్లపాలెం హైస్కూలులో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు.

దేశంలో తీవ్రస్థాయిలో నిరుద్యోగ సమస్య

అనకాపల్లి: దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రస్థాయిలో ఉందని, పది సంవత్సరాల క్రితం భారీ ఎత్తున ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రధాని మోదీ, ఆ ఉద్యోగాలు ఎక్కడ ఇచ్చారని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఐ.ఆర్.గంగాధర్ అన్నారు. స్థానిక బర్మాకాలనీలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీనేతలు కట్టమూరి నూకఅప్పారావు, దాసరి సంతోష్, ఎగ్గాడ భాస్కరరావు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారి మృతికి సంతాప సూచకంగా మార్కెట్ బంద్

అనకాపల్లి: స్థానిక గాంధీ హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ కూరగాయల వ్యాపారి కోడూరు వెంకటరావు(58) అనారోగ్యంతో మృతి చెందడంతో సంతాప సూచకంగా గురువారం మార్కెట్‌కు సెలవు ప్రకటించారు. వెంకటరావు 35 సంవత్సరాలుగా కూరగాయల మార్కెట్‌లో వ్యాపారం చేస్తూ గుర్తింపు పొందారు. గౌరీ హోల్‌సేల్ కాయగూరల వర్తక సంఘ సభ్యులు కొణతాల శివ, వైఎస్ భద్రం, సూరిశెట్టి సందీప్, మళ్ల జగ్గఅప్పారావు, విల్లూరి మోదినాయుడు, ఆల్ల జగ్గారావు, దొడ్డి గోపీ సంతాపం వ్యక్తం చేశారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు



ప్రమాదానికి గురైన కారు

మాకవరపాలెం: తామరం జంక్షన్‌లో రోడ్డు డివైడర్ పైకి కారు దూసుకుపోయింది. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విశాఖ వైపు నుంచి నర్సీపట్నం వస్తున్న కారు బుధవారం అర్ధరాత్రి తామరం జంక్షన్ వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి రోడ్డు డివైడర్‌పైకి ఎక్కేసింది. డివైడర్లకు ఎలాంటి హెచ్చరిక బోర్డులు కాని, రేడియం స్టిక్కర్లు కాని లేవు. ఈ నేపథ్యంలో ఎదురుగా వస్తున్న మరో వాహనం లైట్ల వెలుగులో డివైడర్ కనిపించకపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ సంఘటనలో కారు ఇంజిన్ భాగం దెబ్బతింది.

వైభవంగా సాయి మందిర వార్షికోత్సవం



సాయినాథునికి పూజలు చేస్తున్న భక్తులు

రోలుగుంట: నిండుగొండ కూడలి సమీపంలో సాయినాథుని మందిరం 21వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 05:15 గంటలకు కాగడ హారతితో ఈ ఉత్సవం ప్రారంభమైంది. 08:10 గంటలకు బాబా వారికి పంచామృత అభిషేకం చేశారు. స్థానికులతోపాటు కొవ్వూరు, వెలంకాయపాలెం, కొమరవోలు తదితర గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున బాబాను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

సీఎం జగన్ సభను విజయవంతం చేయండి

- ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మలసాల భరత్‌కుమార్

తుమ్మపాల: కశింకోట మండలం తాళ్లపాలెం సమీపంలో ఈనెల 20న జరగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొనే మేమంతా సిద్ధం సభను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్సు యాత్రలో భాగంగా వస్తున్న సీఎం జగన్‌కు నియోజకవర్గం నుంచి సాదర స్వాగతం పలికేలా భారీ ఎత్తున మేమంతా సిద్ధం బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి కార్యకర్త గ్రామస్థాయిలో ప్రజలను మమేకం చేసి సభకు తరలివచ్చేలా కృషి చేయాలన్నారు.

24న నామినేషన్

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను ఈ నెల 24న నామినేషన్ వేయనున్నానని భరత్‌కుమార్ చెప్పారు. సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందించామని, కార్యకర్తలు, నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి పథకాల గురించి వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసేలా కోరాలన్నారు. ప్రతి వీధిలో గడప గడపకు వైఎస్సార్‌సీపీ కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ బోర్డు చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ భీశెట్టి సత్యవతి, మండల పార్టీ అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద, వైస్ ఎంపీపీ వీల్లూరి సూర్యకుమారి, శేఖర్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు నోట్ల శ్రీనివాసరావు, యువజన విభాగ కార్యదర్శి పల్లెల సాయి సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డ్ మెంబర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి



వెదురుపర్తిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు

కశింకోట: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి అందరూ కృషి చేయాలని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు కోరారు. మండలంలోని వెదురుపర్తి, కశింకోటలోని హౌసింగ్ కాలనీ, కుమ్మరి వీధి, రెల్లి వీధుల్లో బుధ, గురువారాల్లో బూత్ కమిటీల పరిధిలో పార్టీ శ్రేణులు, అభిమానులు, గ్రామస్తులతో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లలో కోట్లాది రూపాయలతో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపలు అభివృద్ధి పనులు నిర్వహించినట్టు చెప్పారు. సిమెంట్ రోడ్లు, కాలువలు, ప్రాధాన్యతా భవనాలు నిర్మించి ఎంతో అభివృద్ధి చేసినట్టు తెలిపారు. మరింత అభివృద్ధి జరగాలన్నా, సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు మాట్లాడుతూ మళ్లీ వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్ర అభివృద్ధితోపాటు గ్రామాలను మరింతగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ శ్రేణులు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను గడప గడపకు వెళ్లి వివరించి, పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో పార్టీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌లను గెలిపించాలని కోరారు.

జోరుగా ప్రచారం



తాళ్లపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో బుధ, గురువారాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు గడప గడపకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌లను గెలిపించాలని కోరారు. పార్టీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, పాల సంఘం అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, పార్టీ నాయకుడు మునిలినాయుడు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

11 మంది గ్రామ వలంటీర్ల రాజీనామా



ఎంపీడీవోకు రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు



రాజీనామా పత్రాన్ని ఎంపీడీవోకి అందజేస్తున్న వలంటీర్ శివ

పాయకరావుపేట : మండలంలో గల పాల్తేరు, సత్యవరం గ్రామాలకు చెందిన 11 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో కె.స్వప్న తెలిపారు. వీరందరూ విడివిడిగా రాజీనామా పత్రాలను రాసి ఇచ్చినట్లు తెలిపారు. పాల్తేరు గ్రామానికి చెందిన 10 మంది, సత్యవరం గ్రామానికి చెందిన ఒక వలంటీరు రాజీనామా చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ తామందరం స్వచ్ఛందంగా రాజీనామాలు చేశామన్నారు. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి తమ విధులకు ఆటంకం కల్పించిన కారణంగా రాజీనామాలు చేశామన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి తామందరం కృషి చేస్తామన్నారు.

స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నా...

ఎస్.రాయవరం : పేదల ఆరాద్య దైవంగా ఉన్న జగన్న గెలుపునకు తాను ప్రచారం చేయడానికి తనకు వలంటీర్ విధుల నుంచి స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్టు నాళ్లం శివ పేర్కొన్నారు. లింగరాజుపాలెం గ్రామ వలంటీర్‌గా పని చేస్తున్న శివ ఇప్పటికే గ్రామపంచాయితీ అధికారికి రాజీనామా పత్రం అందజేసినప్పటికీ అంగీకరించలేదని, దీంతో గురువారం నేరుగా ఎంపీడీవో సత్యనారాయణకు రాజీనామా పత్రం అందజేసినట్టు చెప్పారు. తాను జగన్‌మోహన్‌రెడ్డికి వీర విధేయుడునని తెలిపారు. నేటి నుంచి ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న మరోమారు సీఎం అయ్యేందుకు ఫ్యాను గుర్తుకు ఓటు అడుగుతానని చెప్పి రాజీనామా ఆమోదించాలని కోరారు. ఈ మేరకు ఎంపీడీవో రాజీనామా పత్రాన్ని తీసుకుని ఆమోదింప జేశారు.

21న పాలిటెక్నిక్ మోడల్ టెస్ట్

ఎస్.రాయవరం : పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో ఈ నెల 21 న పాలిటెక్నిక్ మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్టు పీఆర్‌టీయు ఉపాధ్యాయ సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. ఈ పాఠశాలలో ఇప్పటికే పాలిటెక్నిక్ ఉచిత కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ నెల 27న పరీక్షకు వెళ్లే విద్యార్థులకు మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు హాజరై పరీక్ష రాయవచ్చన్నారు. ఆ విద్యార్థులు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకుని పరీక్షకు రావాలన్నారు. ఈ పరీక్ష నిర్వాహణకు జిల్లా పీఆర్‌టీయు ఉపాధ్యాయ సంఘ సభ్యులందరూ సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. మరిన్ని వివరాలకు ఫోన్ :9700341744, 9381197776 నంబర్లను సంప్రదించాలన్నారు.

మద్యం విక్రేతలపై కేసులు

బుచ్చెయ్యపేట: మండలంలో ఏడు గ్రామాల్లో మద్యం, సారా అమ్మకంపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ డి. ఈశ్వరరావు తెలిపారు. గురువారం బుచ్చెయ్యపేట పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సమష్టిగా పలు గ్రామాల్లో మద్యం అమ్మకాలపై దాడులు చేశారు. గున్నెంపూడి, పెదమదీన, చిన అప్పనపాలెం, కేపీ అగ్రహారం, పెదపూడి, తురకలపూడి, గొల్లకొంపలు గ్రామాల్లో మద్యం విక్రేతలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.